# ఇదెక్కడి న్యాయం?

-ఎన్.లక్ష్మీశైలజ



"అయితే ఇప్పుడేమంటావు? ఏంటి నీ బాధ?" అని పేపర్ చదువుతున్న నేను విసుగ్గా తలెత్తి మా ఆవిడను చూస్తూ అన్నాను.

"నేను ఎన్నిసార్లు చెప్పినా మీకు అర్థం కాదు లెండి నా బాధ. చూస్తున్నారుగా వాడ్ని. పెళ్లి చేయగానే ఎలా మారిపోయాడో? పెళ్లవగానే అమ్మను నన్ను మర్చిపోయి పెళ్లాం కొంగు పట్టుకుని తిరుగుతున్నాడు. ఇదివరకు ఆఫీస్ నుండి రాగానే నా దగ్గర కూర్చుని కబుర్లు చెప్పేవాడు. ఇప్పుడు ఆఫీస్ నుండి రావడం ఆలస్యం పెళ్లాం దగ్గర కూర్చోవడం లేదంటే పెళ్లాన్ని తీసుకుని షికార్లు తిరగడం. మహాతల్లి వచ్చి నా బిడ్డను మార్చేసింది" అంది.

ఇప్పుడు తనకు వచ్చిన ఈ బాధకు కారణం ఆఫీస్ నుండి వచ్చిన నా కొడుకు తన భార్యను తీసుకుని సినిమాకు వెళ్లడమే. ఈమధ్యే ఆరునెలల క్రితం మా అబ్బాయికి పెళ్లి చేసాము. కోడలు బుద్ధిమంతురాలు. ఇంట్లో అన్ని పనులు చక్కగా చేస్తుంది. మా ఇద్దరినీ కూడా బాగా చూసుకుంటుంది. అత్తగారితో కూడా సఖ్యతగానే వుంటుంది. అయినా మా ఆవిడకు తనంటే కోపం. మా అబ్బాయి మాటకు ముందు తన పేరే పిలుస్తూ తననే కలవరిస్తూ తన చుట్టూ తిరగడమే దీనికి కారణం. ఇలాంటివన్నీ తను సహించలేకపోతోంది. తల్లిగా వాడిమీద ప్రేమ అని సరిపెట్టుకున్నాను. కానీ రానురాను అది ఈమధ్య అసూయగా మారుతోంది.

వాళ్లు సరదాగా బయటకు వెళ్తున్నామని చెప్తే వెళ్లేటప్పుడు సరే అంటుంది. తీరా వాళ్లు ఇంటికి వచ్చే సమయానికి మొహం నల్లగా మాడ్చేసుకుని కూర్చోవడం లాంటివి చేస్తుంది. నాకు కొన్నాళ్లు ఇంటికి దూరంగా ఎక్కడికైనా వెళ్లి వస్తే ఎలా వుంటుంది? అప్పుడైనా ఈ గొడవ సద్దుమణుగుతుంది అనిపించి వైజాగ్‌లో వున్న మా అమ్మాయి ఇంటికి బయలుదేరాను. ఇంత హఠాత్తుగా ఎందుకూ అంటూనే బయలుదేరింది. అక్కడ అల్లుడికి బ్యాంకులో ఉద్యోగం. అమ్మాయికి రెండేళ్లక్రితం వివాహం చేసాము. ఇంకా పిల్లలు లేరు. అల్లుడు అమ్మాయిని బాగానే చూసుకుంటాడు.

కూతురు దగ్గరకు వచ్చాక నా భార్య సంతోషంగానే కనిపిస్తోంది. ఈ మధ్య బ్యాంకులో పని ఎక్కువగా వుందని అల్లుడు ఇంటికి లేట్‌గా వస్తున్నాడు. ఇంక నా భార్యలో ఇప్పటిదాకా ఉన్న అత్త పాత్ర పోయి అమ్మ పాత్ర ప్రవేశించింది.

మా అమ్మాయికి దగ్గరగా కూర్చుని "ఏంటే అల్లుడు రోజూ ఇలాగే లేట్‌గా వస్తాడా? మీరు అస్సలు బయటకి వెళ్లరా? ఇలా అయితే ఎలా? ఎంతసేపని అలా ఇంట్లో ఒంటరిగా ఉంటావు? కాసేపు అలా బయటకు వెళ్లాలని అనిపించదా? నువ్వే ఆయనను తొందరగా రమ్మని అడుగుతూ ఉండాలి. రోజూ అలా బయటకు వెళ్తూ ఉండండి" అంటూ హితబోధ చేసింది.

"అబ్బా అమ్మా! నీకన్నీ అనుమానాలే. మేము బయటకు వెళ్తూనే వుంటాము. కాకపోతే ఇప్పుడు ఆయన కొంచెం బిజీగా ఉన్నారు. అంతే. నాకో అంటే అన్నావు ఆయన ఉన్నప్పుడు ఇలాంటివి అనకు ఫీలవుతారు" కొంచెం కోపంగానే అంది నా కూతురు.

తరువాత ఒకరోజు అమ్మాయి, అల్లుడు వాళ్ల కొలీగ్ ఇంట్లో ఫంక్షన్ ఉందని బయటకు వెళితే మేమిద్దరమే ఉన్నాము. అలా మాట్లాడుకుంటూ ఉండగా ఇంతలో నేనే కావాలని మా అబ్బాయి ప్రసక్తి తీసుకువచ్చాను వాళ్లేం చేస్తున్నారో అని.

ఆ మాట వినగానే "వాడా? ఏం చేస్తుంటాడు... పెళ్లాన్ని తీసుకుని ఏ సినిమాకో, షికారుకో తిరుగుతూ ఉంటాడు" అంది అక్కసుగా.

"ఇక ఆపుతావా? ఇన్నాళ్లూ నువ్వు ఎన్ని అన్నా సహించాను. నా సహనానికి కూడా ఒక హద్దు వుంటుంది. ఎందుకు ఎప్పుడూ వాడిని, కోడలిని ఆడిపోసుకుంటావు? వాళ్లిద్దరూ సంతోషంగా ఉండడం నీకిష్టంలేదా? ఏం వాళ్లు మాత్రం బయటకు ఎక్కడికీ సరదాగా తిరగకూడదుగానీ నీ కూతురు అల్లుడు మాత్రం బయటకు వెళ్లాలి, సరదాగా తిరగాలి. అల్లుడు నీ కూతురు కొంగుపట్టుకుని తిరిగితే నీకు సంతోషం. మొన్నా అమ్మాయితో నువ్వు మాట్లాడినదంతా విన్నానులే నేను. నీ కూతురు సంతోంగా ఉండాలిగానీ నీ కోడలు ఉండకూడదా? అయినా ఇన్ని అంటున్నావు మన పెళ్లయిన కొత్తల్లో నేను నీ చుట్టూ తిరగలేదా? నిన్ను సినిమాలకు తీసుకెళ్లలేదా? ఎలా ఉన్నా మన పిల్లలు సంతోషంగా ఆనందంగా ఉండాలని మనం కోరుకోవాలి. ఇంకొక్కసారి ఇలా మాట్లాడినాగానీ, కోడలిమీద చాడీలు చెప్పడంగానీ జరిగిందో... ఇక నేనే వాళ్లను దగ్గరుండి మరీ వేరు కాపురానికి పంపిస్తాను జాగ్రత్త' సీరియస్‌గా నా భార్యకు వార్నింగ్ ఇచ్చాను.

ఏమనుకుందో ఏమో... ప్రస్తుతానికైతే నేను చెప్పినదంతా మౌనంగా విని ఊరుకుంది. తరువాత మళ్లీ ఏం ప్రళయం తెస్తుందో చూడాలి మరి!

★